క్లుప్తంగా...

దివ్యాంగుడికి త్రిచక్ర వాహనం అందజేత..



వాహనం అందజేసిన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ తలసాని సాయి కిరణ్‌యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా దివ్యాంగుడికి త్రిచక్ర వాహనం అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. మోండా మార్కెట్ డివిజన్‌కు చెందిన రామయ్య అనే దివ్యాంగుడికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేతుల మీదుగా శనివారం వాహనాన్ని అందజేశారు.

మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు

రాంగోపాల్‌పేట్: బీఆర్‌ఎస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంటరీ ఇన్‌చార్జ్ తలసాని సాయి కిరణ్‌యాదవ్ సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శనివారం సాయికిరణ్‌యాదవ్ జన్మదినం కావడంతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆయనకు ఆశీర్వచనం అందించారు. మాజీ కార్పొరేటర్ అరుణగౌడ్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఈఓ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో నేడు కూరగాయల ధరలు రూ.లలో ఇలా ఉన్నాయి. టమాటా కిలో రూ.13, నల్లవంకాయ రూ.23, పొడుగు వంకాయ రూ.23, బెండకాయ రూ.28, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 45, పందిరి బీర 40, క్యాబేజీ 16, క్యారెట్ 40, దొండ 19, గుండుబీన్స్ 115, గింజ చిక్కుడు 65, గోకరకాయ 45, కీర 15, దోసకాయ 15, బీట్‌రూట్ 18, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 20, చామగడ్డ 35, మొరంగడ్డ 15, కందగడ్డ 55, సొరకాయ 7, పొట్లకాయ 15, అరటికాయ ఒక్కటి రూ.10, మునగకాయ ఒక్కటి రూ.3–4, ముల్లంగి రూ.4–6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు హనుమజ్జయంతి

లాలాపేట: తార్నాక చౌరస్తాలోని లక్ష్మీ గణపతి ఆలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు హనుమజ్జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్టు మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ఉదయం 6 గంటలకు లోక కల్యాణార్థం ఆంజనేయ స్వామికి పంచామృత అభిషేకం, విశేష అలంకరణ, అర్చనలు, ప్రత్యేక పూజలు అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆమె కోరారు. గత 15 ఏళ్ల నుంచి హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

పూడికతీత పనులను త్వరగా చేపట్టాలి



పూడికతీత పనులను పరిశీలిస్తున్న సీఈఓ మధుకర్ నాయక్

రసూల్‌పురా: వర్షాకాలంలో డ్రైనేజీలైన్లు నిండి మురుగు రోడ్లపైకి చేరకుండా జైకా సీవరేజ్ పైపులైన్ పూడికతీత పనులను చేపట్టాలని కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ దఫేదార్లను ఆదేశించారు. శనివారం హెల్త్ సూపరిటెండెంట్ అఫ్జల్‌తో కలిసి ఆయన రసూల్‌పురా సీబీఎస్‌నగర్, పోచమ్మ గుడి, ఇంద్రమ్మనగర్ పెద్దరోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. గతంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి డ్రైనేజీ నీరు పొంగి బస్తీల్లోకి చేరడంతో వీడియో కాల్ ద్వారా పరిస్థితిని సీఈఓకు వివరించారు. దీంతో ఆయన పర్యటించి క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించారు. బక్కెట్ మిషన్ ద్వారా పూడికతీత పనులు చేపట్టి వ్యర్థాలను తొలగించాలని ధఫేదార్ సూరి, రాంచందర్‌లను ఆదేశించారు. అశోక్‌గౌడ్, జబ్బార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రెజిమంటల్‌బజార్‌లో అగ్నిప్రమాదం

రాంగోపాల్‌పేట్: రెజిమెంటల్‌బజార్‌లోని ఓ ఇంట్లో స్వల్ప అగ్ని ప్రమాదం జరిగింది. రెజిమెంటల్‌బజార్‌లోని కాళిమాత దేవాలయం వద్ద శ్రీనివాస్ అనే వ్యక్తి నివాసం ఉంటున్నారు. శనివారం సాయంత్రం 8గంటల సమయంలో షార్ట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో మంటలు రావడంతో స్థానికులు చూసి గోపాలపురం పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ పాన్‌బజార్ జైన్ మందిరంలో ఏర్పాటు చేసిన సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో పేద, మధ్యతరగతి వర్గాల కోసం కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. బూత్ స్థాయిలో 31 మంది పనిచేయాలని ప్రతి ఒక్కరూ సీరియస్‌గా పనిచేస్తూ.. పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకెళ్లాలన్నారు. మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులు మరింతగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్పొరేటర్లు చీర సుచిత్ర శ్రీకాంత్, దీపిక, సరళ తదితరులు మాట్లాడారు. బీజేపీ నాయకులు శ్యామ్‌సుందర్ గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, ఆకుల విజయ, ఎస్ఆర్ మల్లేష్, శ్రీకాంత్, ప్రతాప్, సురేష్‌కుమార్, ఉమేష్ ఖండెల్వాల్‌లతో పాటు ఆయా డివిజన్‌ల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేయాలి



స్వామివారిని దర్శించుకున్న మంత్రి తలసాని, నూతన ధర్మకర్తలు

రాంగోపాల్‌పేట్: ఎస్పీరోడ్డు వీర హనుమాన్ దేవాలయ అభివృద్ధికి నూతన ధర్మకర్తల మండలి సభ్యులు మరింత కృషి చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. శనివారం సికింద్రాబాద్ ఎస్పీరోడ్డు వీర హనుమాన్ దేవాలయ నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులతో సమన్వయం చేసుకుంటూ.. ఎప్పటికప్పుడు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ముందుకెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని ఎంతో అభివృద్ధి చేసి చరిత్రలో నిలిచిపోయేలా చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి నిరంతరం తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. బల్కంపేట ఎల్లమ్మ, ఉజ్జయినీ మహంకాళి, సికింద్రాబాద్ గణపతి దేవాలయం, అమీర్‌పేట్ కనకదుర్గ ఆలయాలను ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించామని వివరించారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కృష్ణ నూతన కమిటీ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి, ఈఓ శ్రీనివాస్‌శర్మ, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీహరి, శేఖర్ పాల్గొన్నారు.

సురక్షిత డ్రైవింగ్‌తోనే ప్రాణాలకు రక్ష..!



అవగాహన కార్యక్రమంలో టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

సనత్‌నగర్: రోడ్డు భద్రతా నియమాలను పాటించి సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ శంకర్‌రాజు తెలిపారు. బేగంపేటలోని హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ బ్యాంక్ ఏపీ అండ్ తెలంగాణ రీజనల్ ప్రధాన కార్యాలయంలో ట్రాఫిక్ నిబంధనలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఇన్సూరెన్స్ ఉద్యోగులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా నియమనిబంధనల గురించి వివరించారు. ఇంటి నుంచి బయటకు వచ్చినప్పుడు మనపై ఆధారపడ్డ కుటుంబసభ్యులను దృష్టిలో ఉంచుకుని సురక్షితంగా వాహనాలను నడపాలన్నారు. రెడ్‌సిగ్నల్ పడినప్పుడే వాహనాలను ఆపకుండా వెళ్లే క్రమంలో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పాదచారులు ఇష్టానుసారంగా రోడ్డు దాటకుండా జీబ్రా క్రాసింగ్ వద్ద మాత్రమే రోడ్డు దాటాలని సూచించారు. వాహనాలు నడిపించే వారు ఖచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను కలిగి ఉండాలన్నారు. బేగంపేట ఎస్సై జయచందర్, టీటీఐ సిబ్బంది వీరన్న, సుమన్, వెంకట్‌ప్రసాద్, నర్సింహ్మా, బ్యాంక్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయం హెడ్ భరత్, క్వాలిటీ మేనేజర్ శ్రీనివాస్ భూపతి తదితరులున్నారు.

అమ్మ గొప్పతనం సాటిలేనిది

సనత్‌నగర్: అమ్మ గొప్పతనం సాటిలేనిదని ఏపీ ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రహ్మణ్యం అన్నారు. మహిళలను దేవతల్లా భావించే సంస్కృతి మనదని అలాంటి గొప్ప సంస్కృతిని పాశ్చాత్య పోకడలు విచ్ఛిన్నం చేస్తుండటం బాధాకరమన్నారు. సహాయ ఫౌండేషన్, వీఎస్ఎల్ ఆర్ట్ గ్యాలరీ సంయుక్తంగా శనివారం బేగంపేటలోని ఓ హోటల్‌లో మాతృదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వృద్ధాశ్రమాలు అనే పదం వినిపించేది కాదని ఇప్పుడు వాటి సంఖ్య పెరిగిపోతుండడం విచారకరమన్నారు. ఏబీవీ ఫౌండేషన్ చైర్‌పర్సన్ కావ్యాకిషన్‌రెడ్డి మాట్లాడుతూ. అమ్మకు అమ్మే సాటి అని, మాతృమూర్తులను దైవంతో సమానంగా పూజించుకోవడం మన సంస్కృతిలో భాగమన్నారు.

కమనీయం... శ్రీనివాసుని కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ ప్రకాశరావు దంపతులు

చిలకలగూడ: నామాలగుండులోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని పుష్పాలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, పట్టువస్త్రాలతో ఉత్సవ విగ్రహాలను అలంకరించి, మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్చరణ మధ్య శ్రీనివాసుని కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు, ఇందిరాదేవి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గత కొన్నేళ్లుగా భక్తుల కోరిక మేరకు ప్రతి నెలా 2వ శనివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని జరిపిస్తున్నామని ఆలయ చైర్మన్ ప్రకాశరావు తెలిపారు.

లేబర్ కార్డుదారులకు ఉచిత వైద్య శిబిరం



నిర్మాణ రంగ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలోని మధురానగర్ కమ్యూనిటీహాల్‌లో తెలంగాణ భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ మండలి ఆధ్వర్యంలో శనివారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ సామల హేమ హాజరై కార్మికులకు ఆరోగ్య పరీక్ష కార్డులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. లేబర్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నిత్యం దుమ్ము, ధూళిలో కష్టపడుతూ అనారోగ్యాలకు గురవుతున్న కార్మికులకు తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి ద్వారా ఆరోగ్య శిబిరాలు నిర్వహించి రక్తపోటు, షుగర్, చెవి, కంటి పరీక్షలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ విజయ్, బీఆర్‌ఎస్ నేతలు శైలేందర్, అబ్దుల్ అజిత్ తదితరులు పాల్గొన్నారు.

'అమ్మ దీవెనలే శ్రీరామరక్ష'!



కేక్‌కట్ చేయిస్తున్న దృశ్యం

రసూల్‌పురా: భగవంతుడు అనిచోట్లా ఉండలేకే అమ్మను సృష్టించాడని బీఆర్‌ఎస్ కంటోన్మెంట్ సీనియర్ నాయకులు గణేష్ అన్నారు. ఈ రోజు అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా బాలంరాయి అంబేద్కర్ సొసైటీలో మాతృదినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ గణేష్ పలువురు మాతృమూర్తులను శాలువాతో సత్కరించి చీరలను పంపిణీ చేసి అనంతరం కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నవమాసాలు మోసి తమ ప్రాణాలు ఫణంగా పెట్టి అమ్మ జీవం పోస్తుందని తమ బిడ్డలను కంటికి రెప్పలా కాపాడుతుందన్నారు. ప్రతి ఏటా మాతృమూర్తి దినోత్సవం సందర్భంగా అమ్మలను సన్మానించి కానుకలను అందజేస్తామని అమ్మ చల్లని దీవేనలే మనకు శ్రీరామరక్ష అని అన్నారు. స్థానిక మహిళలు ఎల్. విజయలక్ష్మి, సత్తమ్మ, లలిత, యాదమ్మ, జ్యోతి, శైలజ, మల్లేష్, శరత్, కిరణ్, లీకేష్, సౌమ్య, శారద తదితరులున్నారు.

దళిత క్రైస్తవులపై దాడులు అరికట్టాలి

రాంగోపాల్‌పేట్: దళిత క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అరికట్టాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని అమృతవాణిలో దళిత క్రైస్తవుల రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ చెల్లప్ప, తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్‌కుమార్, ఏఐసీఎఫ్ జాతీయ అధ్యక్షులు విజయరాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం జోక్యం చేసుకుని మణిపూర్‌లో క్రైస్తవులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సంస్థ మహిళా విభాగం అధ్యక్షురాలు జయశ్రీ, రాష్ట్ర కో– ఆర్డినేటర్ ఏకే గిడియోన్, కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ ఎస్ అబ్రహం, ముఖ్య సలహాదారులు బిషప్ మేడ అహరోను, బిషప్ జీ శామ్యూల్ జాన్, విజయ, గ్రేస్ నిర్మల, నిత్య సుజాత తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అభినందన



కంటోన్మెంట్: ఇటీవల విడుదలైన పదోతరగతి ఫలితాల్లో టాపర్‌గా నిలిచిన కంటోన్మెంట్ నాల్గో వార్డుకు చెందిన తనుశ్రీని దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తెలు లాస్యనందిత, నివేదితలు శనివారం విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లాస్య మాట్లాడుతూ.. తనుశ్రీ ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమని భవిష్యత్తులో వారు ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వివిధ ఆలయాల చైర్మన్లు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు మార్కెట్ డైరెక్టర్లు కార్యకర్తలున్నారు.

కార్ఖానా శ్రీపురి కాలనీలో..

గతంలో దివంగత ఎమ్మెల్యే సాయన్న మంజూరు చేయించిన రూ. 38 లక్షల వ్యయంతో చేపడుతున్న తాగునీటి పైపులైన్ పనులను లాస్య నందిత పరిశీలించారు. త్వరితగతిన పనులను పూర్తి చేసి తాగునీరు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సదానంద్, పనస సంతోష్, రమేష్, భాస్కర్ తదితరులున్నారు.

కంటోన్మెంట్ సివిలియన్లను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలి



పోస్టుకార్డు ఉద్యమంలో పాల్గొన్న స్థానిక నేతలు, మంచ్ ప్రతినిధులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ ప్రాంతాలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలని కోరుతూ కంటోన్మెంట్ వికాస్ మంచ్ చేపడుతున్న పోస్టు కార్డు ఉద్యమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవీందర్ అన్నారు. శనివారం 8 వ వార్డు బొల్లారం రిసాల బజార్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ స్థానిక నాయకులు జంగాల మురళి యాదవ్, పీడి. అశోక్‌కుమార్, పోతురాజు శ్యామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమాన్ని నిర్వహించారు. రిసాలబజార్, కళాసిగూడ, గడ్డిబస్తీ, దర్జీబస్తీ, జెండా బస్తీ, పెన్షన్‌పురా ఆదర్శనగర్ ప్రాంతాలకు చెందిన పలువురు స్వచ్ఛందంగా తరలివచ్చి విలీనం కోరుతూ.. పీఎంఓ కార్యాలయానికి పోస్టుకార్డు రాశారు. మరో మూడు వార్డుల్లో ఈ పోస్టు కార్డు ఉద్యమం చేపట్టి ప్రధాన మంత్రి కార్యాలయానికి పంపనున్నట్లు రవీందర్ వివరించారు. బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ ఆర్. ఖదీరవన్, డాక్టర్ శంకర్‌రావు మంచ్ అధ్యక్షుడు న్యాయవాది ఏబెల్, ప్రభుగుప్తా, మహమ్మద్ ఫస్సీ, స్థానిక నాయకులు సుదర్శన్, ఉమేష్, ఇక్బాల్, బాలరాజు, శ్రీశైలం యాదవ్, సత్యనారాయణ, సుధాకర్ యాదవ్, దేవేందర్ పాల్గొన్నారు.

మేడిబావిలో కార్పొరేటర్ పర్యటన

సికింద్రాబాద్: మేడిబావి ఆర్య సమాజ్ ప్రాంతంలో శనివారం కార్పొరేటర్ సామల హేమ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి లోప్రెషర్ సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వెంటనే జలమండలి అధికారులతో మాట్లాడి లోప్రెషర్ సమస్యను పరిష్కరించాలని కోరారు. అదే విధంగా పాడైపోయిన పవర్‌బోర్లకు కూడా వెంటనే మరమ్మతు చేయించాన్నారు. ఈ పర్యటనలో బీఆర్‌ఎస్ నాయకులు అనిత, జ్యోతి, కాలనీవాసులు సత్యనారాయణ, నరేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల విజయోత్సవ సంబరాలు



మిఠాయిలు పంచుతున్న కాంగ్రెస్ నేతలు

సనత్‌నగర్: కర్ణాటకలో కాంగ్రెస్ విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాపోలు ఎలీషా ఆధ్వర్యంలో పార్టీ జెండాతో వీధుల్లో ప్రదర్శన చేపట్టారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. కర్ణాటక మాదిరిగానే తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ దుందుభి మోగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయానన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అందరికీ సమన్యాయం జరుగుతుందన్న అభిప్రాయ పడ్డారు. పార్టీ నాయకులు ఐవాన్‌వాజ్, నవీన్, రాజు, ప్రవీణ్, లక్ష్మణ్, అజ్జూ తదితరులున్నారు.



పీజేఆర్ విగ్రహం వద్ద సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నేతలు

రాంగోపాల్‌పేట్: రాంగోపాల్‌పేటలో పీసీసీ కార్యదర్శి శీలం ప్రభాకర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు టపాసులు కాల్చి స్వీట్లు పంచుతూ.. సంబురాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్ణాటక రాష్ట్రంలో బీజేపీ పతనం మొదలైందని దేశ ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు ఎదురు చూస్తున్నారన్నారు. రాహుల్‌గాంధీ నేతృత్వంలో త్వరలో జరిగే ఎన్నికల్లో ఢిల్లీ పీఠం దక్కించుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూడా పార్టీ విజయం సాధిస్తుందన్నారు.

జూబ్లీబస్‌స్టేషన్ సమీపంలో..

రసూల్‌పురా: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో కంటోన్మెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. శనివారం జూబ్లీ బస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న పీజేఆర్ విగ్రహం వద్ద పార్టీ సీనియర్ నాయకులు రామ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సంబురాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ జోడో యాత్ర, ప్రియాంక గాంధీ చరిష్మా కర్ణాటక కాంగ్రెస్ నేతల ఐక్యత కారణంగా హస్తం పార్టీ ఘన విజయం సాధించిందన్నారు. ఈరోజు కర్ణాటక, కొద్ది రోజుల్లో తెలంగాణ, ఆ తర్వాత ఢిల్లీ కోటపై కాంగ్రెస్ పార్టీ పతాకం రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కర్ణాటకలో 40 శాతం కమీషన్ సర్కారుగా పేరు సంపాదించి ఓడిన బీజేపీ రాష్ట్రంలో కూడా బీఆర్‌ఎస్ పార్టీకీ ఓటమి తప్పదని అభిప్రాయపడ్డారు. పార్టీ సీనియర్ నాయకులు డీబీ. దేవేందర్, బల్వంత్‌రెడ్డి, జమీల్, వినోద్, రవి, బాబురావు, సంజీవ, అష్రాఫ్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.